

క్రమ‌శిక్షణ@ఎన్‌సీసీ

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను సైన్యంలో చేరేలా ప్రోత్సహించడం, దేశభక్తిగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తోంది. - 8లో..



గ్రామస్తులపై అటవీ అధికారుల దాడి

గడ్డి కోసం అటవీ ప్రాంతానికి వెళితే అటవీ అధికారులు తమపై దాడి చేశారని పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామస్తులు నిరసన తెలిపారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 31/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

26న సింగరాయకొండలో జాబ్‌మేళా

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 26వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టీ భరద్వాజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు 18 ఏళ్ల నిండి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ విద్యను అభ్యసించి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.13 వేల నుండి రూ.28 వేల వరకూ వేతనం ఇస్తారని చెప్పారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల ఫొటోస్టాట్ కాపీలను తీసుకురావాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు 8897964505 అనే నంబరులో సంప్రదించాలన్నారు.

ఎస్సీల వర్గీకరణ పేరుతో రిజర్వేషన్లు ఎత్తి వేసే కుట్ర

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీల వర్గీకరణ పేరుతో రిజర్వేషన్లను ఎత్తి వేసే కుట్ర చేస్తున్నారని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీ అశోక్ పేర్కొన్నారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశోక్ మాట్లాడుతూ ఎస్సీల ఉప వర్గీకరణ, క్రీమీలేయర్‌కు వ్యతిరేకంగా మాలల మహాగర్జన పేరుతో కందుకూరులోని ఏబీఎం గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి మాల నాయకులు పాల్గొంటారన్నారు. సమావేశంలో మాల ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీరాములు, వై మల్లిఖార్జునరావు, డీ నరసింహం, పీ రామారావు, ఎం శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సిబ్బంది బదిలీల్లో అవినీతిపై విచారణ

ఒంగోలు వన్‌టౌన్: ఎక్సైజ్ శాఖలో ఇటీవల జరిగిన సిబ్బంది బదిలీల్లో అవినీతిపై శనివారం డీఆర్‌ఓ బీసీహెచ్ ఓబులేషు విచారణ నిర్వహించారు. మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కే సుజన్ మాదిగ ఎక్సైజ్ శాఖలో బదిలీల్లో అవినీతి, లిక్కర్ అమ్మకాలలో రూ.2 కోట్ల మేర నిధులు గోల్‌మాల్ అవడం తదితర అంశాలపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఫిర్యాదు పై డీఆర్‌ఓను విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఈ విచారణలో ఎక్సైజ్ ఈఎస్ ఖాజావుద్దీన్ తనకు బుధవారం వరకూ సమయం ఇవ్వాలని పూర్తి వివరాలను సమర్పిస్తామని కోరడంతో విచారణ వాయిదా పడింది. ఈ విచారణలో ఫిర్యాదు దారులు కే సుజన్ మాదిగ, ఎం సుధాకర్ మాదిగ, త్యాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పంటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

దర్శి: ప్రస్తుతం ఉన్న వరి, కంది, అపరాలు, మిరప పంటల్లో ముందస్తు జాగ్రత్తగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ పీ సంధ్యారాణి అధ్యక్షతన శిక్షణ, సందర్శన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల అనుసంధానంలో ప్రస్తుత పంటల్లో రైతులకు కావాల్సిన వ్యవసాయ సమాచారం అందించాలన్నారు. డాక్టర్ పీ సంధ్యారాణి మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ పరిస్థితులు, సాగులో తీసుకోవాల్సిన అధునాతన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాద్‌రావు మాట్లాడుతూ కంది, వరి, మినుము, మొక్కజొన్న, పొగాకు పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జీ రమేష్ మాట్లాడుతూ పంటల్లో తీసుకోవాల్సిన పోషక, ఎరువుల యాజమాన్య, కలుపు నివారణ పద్ధతుల గురించి వివరించారు. ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్ర బాబు మాట్లాడుతూ మిరప, కూరగాయ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం డీపీడీ రామమోహన్‌రావు మాట్లాడుతూ ఆత్మపథకం తరపున చేపడుతున్న శిక్షణ కార్యక్రమాలు, ప్రదర్శనల వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో దర్శి పశువైద్యుడు డాక్టర్ బసవయ్య, వివిధ వ్యవసాయ సబ్‌డివిజన్‌ల ఏడీఏలు, వారి వారి వ్యవసాయ సబ్ డివిజన్‌లలో పంటల వివరాలు, సాగు విస్తీర్ణం, చీడ పీడల సమస్యల గురించి వివరించి శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తీసుకున్నారు.

రెచ్చిపోతున్న మట్టి బకాసురులు..!

జిల్లాలో మట్టి మాఫియా విచ్చలవిడిగా రెచ్చిపోతోంది. కొండలు, గుట్టలు, వాగులు, వంకలను వదిలి పెట్టడం లేదు. రేయింబవళ్లు జేసీబీలతో యథేచ్ఛగా తవ్వేస్తూ టిప్పర్లు, లారీల్లో తరలించేస్తున్నారు. ఎవరైనా అడ్డువస్తే వారి మీద దాడులకు కూడా వెనకాడడం లేదు. అక్రమ కేసులు బనాయిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఎమ్మెల్యే తాలూకా అంటూ వారు చేస్తున్న అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఈ దోపిడీ దర్జాగా సాగిపోతోంది.

- రేయింబవళ్లు తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత
- ఇష్టారాజ్యంగా అక్రమ రవాణా
- ఎమ్మెల్యే తాలూకా అంటూ యథేచ్ఛగా తవ్వకాలు
- టన్నులకొద్దీ మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్న తమ్ముళ్లు
- నెలవారీగా ప్రజా ప్రతినిధులకు అందుతున్న తాంబూలాలు
- మామూళ్ల మత్తులో కళ్లు మూసుకుంటున్న అధికారులు



పెద్దారవీడు మండలం రామాయపాలెం వెళ్లే దారిలో మట్టి తవ్వకాల కోసం ఏర్పాటు చేసిన జేసీబీ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్నట్లుగా పగలు రాత్రి అనే తేడా లేకుండా జేసీబీలు పెట్టి మట్టిని తవ్వుకుంటున్నారు. అధికార తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లోనే ఈ మట్టి దందా నడుస్తుండడం గమనార్హం. దీంతో అధికారులు చేష్టలుడిగి చూడడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. ప్రధానంగా పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో మట్టి మాఫియాకు అడ్డే లేకుండా పోతోంది. ఈ ప్రాంతంలో ఒక ఎమ్మెల్యేకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయని ప్రచారం జరుగుతోంది. దోర్నాల ప్రాంతంలో మట్టి తవ్వకాల విషయంలో భారీ మొత్తంలో డిమాండ్ చేసినట్లు ఆ పార్టీ నాయకులు చెవులు కొరుక్కుంటున్నారు. ఒంగోలు ప్రాంతంలో పోలీసులు ట్రాక్టర్‌కు రూ.500 వసూలు చేస్తున్నట్లు సమాచారం. కొండపిలో దేవుడి భూములను కూడా వదిలి పెట్టకుండా మట్టిని తవ్వేస్తున్నారు.

నెలకు రూ.2 లక్షల కప్పం:

గిద్దలూరు నియోజకవర్గంలో మట్టితవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గిద్దలూరు మండలంలోని కేఎస్ పల్లి సమీపంలో దుప్పిలతిప్ప, ఉయ్యాలవాడ సంజీవనిపేట వేములపాడు, పట్టణంలోని రాజా నగర్, హోసన్న మందిర్ రోడ్డులోని కొండ ప్రాంతం, కొంగలవీడు గ్రామాల పరిధిలో మట్టి తోలకాలు జరుగుతున్ రాచర్ల పెద్ద చెరువు, కొమరోలులోని తాటిచెర్లలో మట్టిని తవ్వుకుంటున్నారు. కంభంలోని ఏనుగుకొండ, బేస్తవారిపేటలో పెంచికలపాడు, అర్ధవీడులో నాగులవరం కొండ నుంచి మట్టిని తవ్వేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ప్రతి మండలం నుంచి నెలకు రూ.2 లక్షలను కీలక నాయకుడి తమ్ముడికి కప్పం చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బేరం కుదరలేదని పని ఆపేశారు:

యర్రగొండపాలెం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అవినీతి మీద వస్తున్నన్ని ఆరోపణలు మరెక్కడా రావడం లేదు. ఇక్కడ మట్టి పనుల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందనేది బహిరంగ రహస్యం. దోర్నాల వద్ద జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం హనుమాన్ జంక్షన్ వద్ద కొండ నుంచి మట్టిని తరలిస్తున్నారు. అయితే తన సంగతేందని ఇన్‌చార్జి బావమరిది సదరు కాంట్రాక్టర్‌ను అడిగినట్లు తెలుస్తోంది. భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో ఆ కాంట్రాక్టర్ నోరెళ్లబెట్టినట్లు సమాచారం. అంతపెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వలేనంటూ చేతులెత్తేయడంతో పది రోజుల పాటు పనులు ఆపేసినట్లు తెలుస్తోంది. ఆ తరువాత బేరం కుదరడంతో ఇప్పుడు పనులు పునఃప్రారంభమయ్యాయని చెప్పుకుంటున్నారు. యర్రగొండపాలెంలోని దశబంధం చెరువు, రాళ్లవాగు, మురారిపల్లి చెరువు, గురిజేపల్లి, బోయలపల్లి చెరువుల నుంచి నిరంతరాయంగా తవ్వకాలు సాగుతున్నాయి.

కొత్తపట్నం నుంచి...

ఒంగోలు నియోజకవర్గంలో మట్టి తవ్వకాలకు కొత్తపట్నం అడ్డాగా మారింది. కొత్తపట్నం మండలంలోని మడనూరు, ఈతముక్కల, రాజుపాలెం, గొడపాలెం, గమళ్లపాలెం, గుండుమాల ప్రాంతాల్లో జోరుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అల్లూరు నుంచి అన్నవరప్పాడు మీదుగా ఒంగోలుకు మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం. రాత్రిళ్లు మట్టిని ఒంగోలుకు తరలించి నెల్లూరు బైపాస్ సమీపంలో నిల్వ చేసుకొని మరుసటి రోజు విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. మండలంలోని కరవది, ఉలిచి, సంతనూతలపాడు నియోజకవర్గంలోని మద్దిపాడు నుంచి కూడా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక దర్శి నియోజకవర్గంలోని దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు, దొనకొండ, కురిచేడు మండలాల్లో మట్టి తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి.

ప్రజా ప్రతినిధులకు వాటాలు..

జిల్లాలో జరుగుతున్న మట్టి అక్రమ రవాణా మొత్తం అధికార పార్టీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే జరుగుతుందని సమాచారం. నియోజకవర్గంలో ఎవరు పడితే వారు మట్టి తవ్వుకోడానికి వీల్లేదని, కేవలం తెలుగుదేశం పార్టీకి చెందిన వారు మాత్రమే మట్టిని తవ్వుకోవాలని హుకుం జారీ చేయడంతో మట్టి వ్యాపారంలో తమ్ముళ్లు తలమునకలయ్యారు. నెలవారీ కమీషన్లు ఇవ్వాలని కొందరు ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పశ్చిమ ప్రకాశం జిల్లాలో మామూళ్ల బేరాలు కుదిరినట్లు చెప్పుకుంటున్నారు. దర్శి నియోజకవర్గంలో టిప్పర్‌కు ఏడాదికి రూ.30 నుంచి రూ.60 వేలు డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం. యర్రగొండపాలెం ఇన్‌చార్జ్ తరఫున ఆయన బావమరిది పెద్ద మొత్తంలో డిమాండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. కొండపిలో అంతా సత్య చూసుకుంటున్నారని అధికారులు, అధికార పార్టీ నాయకులు గుసగుసలాడుతున్నారు.

దేవుడి భూములను వదిలిపెట్టలేదు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలో తమ్ముళ్లు దేవుడి భూములను కూడా వదిలి పెట్టడంలేదు. సింగరాయకొండ మండలంలోని పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి చెందిన భూములను పెద్ద మొత్తంలో మట్టిని తవ్వుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే పాత సింగరాయకొండ, శానంపూడి, కనుమర్ల ప్రాంతాల్లోని మర్రిచెరువు, సింగినంపల్లి చెరువు, జువ్వలగుంట చెరువు, రాజు చెరువుల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా కొందరు వ్యాపారులు ప్రభుత్వ భూములు, పట్టా భూములను లీజుకు తీసుకొని ఎర్ర మట్టిని తవ్వుకుంటున్నారు. మట్టిని తవ్వుకున్న తరువాత ఏర్పడిన గుంతలను చెరువుల నుంచి మట్టిని తెచ్చి పూడ్చేలా లీజులో ఒప్పందం చేసుకుంటున్నారు. దాంతో ఎర్రమట్టి గుంతల్లో నల్ల మట్టి తెచ్చి పూడుస్తుండడంతో భూముల స్వభావం మారిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు..

టన్నులకొద్దీ మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. నెలవారీ మత్తులో కొందరు అధికారులు వ్యాపారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒంగోలు నియోజకవర్గంలో ఈతముక్కల, అల్లూరు వద్ద పోలీసు నిఘా ఏర్పాటు చేశారు. అయితే పోలీసులు ట్రాక్టర్‌కు రూ.500 తీసుకొని వదిలిపెడుతున్నట్లు సమాచారం. చెరువులను తవ్వుకుంటున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయం గురించి ఒక అధికారిని వివరణ అడుగగా.. అధికార పార్టీ ఎమ్మెల్యే తాలూకా అని చెబుతున్నప్పుడు మేమేమీ చేయలేమని చేతులెత్తేశారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

- లైంగిక వేధింపుల చట్టం పక్కాగా అమలు చేయాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



లైంగిక వేధింపుల చట్టంపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: పని ప్రదేశాల్లో జరిగే లైంగిక వేధింపుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని చట్టాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతులుగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం భవనంలోని పని ప్రదేశంలో శనివారం మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013పై మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. దీనిలో పాల్గొన్న కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ లైంగిక వేధింపులను అరికట్టేందుకు సంబంధిత చట్టాలను పక్కాగా అమలు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పని ప్రదేశాల్లో జరిగే మహిళా లైంగిక వేధింపులపై చట్టాలను పక్కాగా అమలు చేస్తూ అరికట్టాలన్నారు. ఈ చట్టం కింద ఇప్పటి వరకు 41 కేసులు నమోదైనట్లు తెలిపారు. చట్టంపై అవగాహన లేకపోవడం, ఒకవేళ అవగాహన ఉన్నా ధైర్యంగా ఫిర్యాదు చేయలేకపోవడం వంటి కారణాలతో తక్కువ కేసులు నమోదవుతున్నాయనే అభిప్రాయం వెల్లడించారు. ఇంటి నిర్వహణతోపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే మహిళలు మంచి, సురక్షిత వాతావరణంలో విధులు నిర్వహించేలా ఈ చట్టం తోడుతుందన్నారు. ఏదైనా పని ప్రదేశంలో మహిళ లైంగిక వేధింపులకు గురైతే ఆ మహిళా ఉద్యోగికి అండగా నిలవాల్సిన బాధ్యత ఇతర మహిళా ఉద్యోగులపై ఉందన్నారు. ఈ చట్టంపై మహిళలు పూర్తి అవగాహన చేసుకుని పనిచేసే ప్రతిచోటా అంతర్గత కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సీనియర్ సివిల్ జడ్జి జీ దీనా మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగపరంగా ఇచ్చిన హక్కులను పరిరక్షించడం, పనిచేస్తున్న ప్రదేశాల్లో ఉద్యోగ భద్రత కల్పించడం, ఉద్యోగ విధులు నిర్వర్తించేందుకు సంతోషకరమైన సురక్షిత వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా లైంగిక వేధింపుల నిరోధక చట్టం ఏర్పాటు నిబంధనల అమలు తదితర వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాదిలి సీడీపీవో సుధామాధురి వివరించారు. తొలుత లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమల్లో భాగంగా ఏపీజేఏసీ అమరావతి జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన షీ బాక్స్‌ను కలెక్టర్ ప్రారంభించారు. దీనిలో ఐసీడీఎస్ పీడీ మాధురి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు పునః ప్రారంభం

మార్కాపురం:

మార్కాపురం పట్టణంలో శనివారం నుంచి ఆక్రమణల తొలగింపు పునఃప్రారంభమైంది. 2 వారాల క్రితం కళాశాల రోడ్డు, కంభం రోడ్డు, కోర్టు సెంటరు వరకూ మున్సిపల్ సిబ్బంది మున్సిపల్ కాలువల వరకూ, కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఆ తరువాత తొలగింపు ప్రక్రియ నిలిపేశారు. దీంతో అందరూ ఆక్రమణల తొలగింపు మిగిలిన బజారుల్లో లేనట్టేనని భావించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ నారాయణరావు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, సీఐ సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమరావు తదితరులు తమ సిబ్బందితో వచ్చి పార్కు ఎదురుగా ఉన్న మెయిన్‌బజారు నుంచి జేసీబీలతో కాలువలపై ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రారంభించారు. దీనితో అమ్మవారిశాల బజారులో ఉన్న ఆయా షాపుల యజమానులు కొంతమంది హడావుడిగా తమ షాపు ముందుభాగాన ఉన్న రేకులు, మెట్లు తొలగించుకోగా మిగిలిన వాటిని మున్సిపల్ అధికారులు తొలగించారు. తేరు బజారు, నాయుడు వీధిలో కూడా మున్సిపల్ కాలువలపై ఉన్న ఆక్రమణల వరకూ అధికారులు తొలగించారు. ఈ పరిస్థితుల్లో పలువురు చిరువ్యాపారులు అధికారుల వద్దకు వచ్చి తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాలని కోరారు. లేదంటే తమ కుటుంబాలు వీధిన పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు.



మెయిన్ బజారులో ఆక్రమణల తొలగింపు

మూడురోజుల సమయం ఇవ్వండి:

మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆక్రమ ణల తొలగింపునకు మూడు రోజులు సమయం ఇవ్వాలని ఆయా వ్యాపార సంస్థల నిర్వాహకులు, భవన యజమానులు ఏవైనా ఆక్రమణలు ఉంటే తొలగించుకుంటారని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆక్రమణలు ప్రారంభం కాగానే ఆయన అక్కడికి వచ్చి మూడు రోజుల సమయం ఇస్తే వ్యాపారులే ఏవైనా ఆక్రమణలు ఉంటే తీసేస్తారని, అప్పటికీ తొలగించకుంటే ఆక్రమణలను భావిస్తే మీరు తొలగించాలని అన్నారు. ఏయే ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగిస్తారో మార్కింగ్ ఇవ్వాలని చైర్మన్ కోరారు.

స్వచ్ఛందంగా తొలగించుకోండి : నారాయణరావు, కమిషనర్

మార్కాపురం పట్టణ పరిధిలో మున్సిపల్ కాలువల వరకూ, కాలువలపై ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేదంటే తమ సిబ్బంది యంత్రాల సాయంతో తొలగిస్తారని కమిషనర్ నారాయణరావు హెచ్చరించారు. ఎవరికి వారు స్వచ్ఛందంగా తొలగించుకుంటే షాపుల్లో, షాపుల బయట ఉన్న వస్తువులు సురక్షితంగా ఉంటాయని, జేసీబీతో తొలగిస్తే ఇబ్బందులు పడతారని ఆయన చెప్పారు.

108 ఉద్యోగులను బానిసల్లా చూస్తున్న ప్రభుత్వం

ఒంగోలు టౌన్: ఉద్యోగుల చేత కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ 12 గంటల పాటు పనిచేయించుకుంటున్న అరబిందో యజమాన్యం 108 సిబ్బందిని ఉద్యోగులుగా కాకుండా బానిసలుగా చూస్తోందని, అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్నా గాలి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా వివిధ రూపాల్లో చేస్తున్న ఆందోళనలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు కనీస స్పందన రాలేదని చెప్పారు. దాంతో అనివార్యంగా ఈ నెల 26 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. యాజమాన్యం 108 ఉద్యోగుల చట్టపరమైన హక్కులను హరించివేసిందన్నారు. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ధరలకనుగుణంగా ఇంక్రిమెంట్లు వేయాలని డిమాండ్ చేశారు. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునే సమయంలో చాలా మంది 108 ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని, అయినా ప్రభుత్వం కానీ, యాజమాన్యం కానీ పట్టించుకున్న పాపానపోలేదని, వారి కుటుంబాలను ఆదుకోవడం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వమే 108ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. 108 సిబ్బంది చేస్తున్న సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, అన్నీ వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రావిడెంట్ ఫండ్ చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నెల రోజులుగా చేస్తున్న ఆందోళనలను రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయకపోవడం బాధాకరమన్నారు. 26 తేదీ తరువాత జరిగే సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సీఐటీయూ అనుబంధ సంఘాల తరపున సమ్మెకు పూర్తిస్థాయి మద్దతు ప్రకటించారు. 108 ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

108 వాహనాలు శిథిలావస్థకు చేరిపోయినా బాధితులకు సేవ చేయడంలో ఉద్యోగులు వెనకాడలేదని తెలిపారు. ఎప్పటికప్పుడు వాహనాలకు మరమ్మతులు చేయించడంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ ఉపాధ్యక్షుడు పారా శ్రీనివాసరావు, మెడికల్ రిప్రజెంటేటివ్ అసోసియేషన్ నాయకులు చిరంజీవి, 108 యూనియన్ నాయకులు సువర్ణ, రేఖ, మున్సిపల్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ ను తనిఖీ చేసిన కలెక్టర్

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని ఎస్ఎస్‌కేసీఎం జెడ్పీ హైస్కూల్ ను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు పాఠశాలలో పారిశుద్ధ్యం పైన మరింత దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. గణితంలో, ఇంగ్లిష్ లో పిల్లల పరిజ్ఞానాన్ని పరిశీలించారు. బోర్డు పైన హెచ్చవేతలను రాసి పరిష్కరించాలని విద్యార్థులకు చెప్పారు. అనంతరం ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదులు నిర్మాణం, ఇండోర్ ఆడిటోరియం నిర్వహణ గురించి హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, అపార్ ఐడీ జనరేషన్ పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఆన్‌లైన్ విధానంలో ఎదురవుతున్న సమస్యలను ఆమె నిశితంగా పరిశీలించారు. ఆధార్ కార్డు, స్కూల్ రికార్డ్స్, జనన ధ్రువీకరణ పత్రాల్లో ఒకే పుట్టిన తేదీ ఉన్న విద్యార్థుల అపార్ ఐడీ జనరేషన్ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికి ముందుగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి పాఠశాలలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ ను పరిశీలించారు. ఓటరు జాబితాలో కొత్తగా నమోదు, తొలగింపు, అడ్రస్ మార్పు కోసం వస్తున్న దరఖాస్తులు, వాటిని పరిష్కరిస్తున్న తీరును ఆమె బీఎల్వోలని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, ఈఆర్వో వర కుమార్, ఎంపీడీవో సురేష్ బాబు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంఈఓ వెంకారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ప్రమోద, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమిమ్ అన్సారియా


కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కవాతు చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు


ఎన్‌సీసీ విద్యార్థులకు క్యాంప్‌లో సూచనలిస్తున్న ఆర్మీ అధికారి


ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థినులు

క్రమశిక్షణ @ ఎన్‌సీసీ

చిన్న వయసులోనే ఒంటిపై ఖాకీ యూనిఫాం.. క్రమశిక్షణ.. సామాజిక సేవ.. దేశభక్తి.. భవిష్యత్తులో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో చేరి దేశానికి సేవలందించేందుకు తోడ్పడే స్థాయిలో ఓ మినీ సైనిక శిక్షణ.. ఆయుధాల వినియోగంపై అవగాహన.. ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి పాఠశాల స్థాయి నుంచే బాధ్యత గల పౌరులను తీర్చిదిద్ది దేశానికి అందించే సంస్థే.. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ). ఎంతో మంది గొప్పగొప్ప సైనికులను, పౌరులను తీర్చిదిద్ది దేశ సేవకు అంకితం చేసింది ఎన్‌సీసీ.. నేడు అంతర్జాతీయ ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

- రెండో రక్షణ దళంగా ఎన్‌సీసీకి గుర్తింపు
- సర్టిఫికెట్లు పొందితే విద్య, ఉద్యోగాలలో అదనపు రిజర్వేషన్లు
- జిల్లాలో సుమారు 3 వేల మందికిపైగా ఎన్‌సీసీ విద్యార్థులు
- పాఠశాల, కళాశాల స్థాయిలో శిక్షణ
- నేడు అంతర్జాతీయ ఎన్‌సీసీ దినోత్సవం

కంభం: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను సైన్యంలో చేరేలా ప్రోత్సహించడం, యువతను క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీది కీలక పాత్ర. విద్యార్థులకు సైన్యంపై అవగాహన కల్పించి వారు సైనికులుగా తయారయ్యేందుకు ఎన్‌సీసీ ఎంతో తోడ్పడుతోంది. ప్రపంచంలో తొలిసారిగా జర్మనీలో 1666వ సంవత్సరంలో ఎన్‌సీసీని ప్రారంభించారు. భారత దేశంలో సైన్యం కొరత తీర్చేందుకు 1917లో యూనివర్సిటీ కార్ప్స్ పేరుతో ఆరంభమైంది. 1920లో యూనివర్సిటీ ట్రైనింగ్ కార్ప్స్ ఏర్పడగా, 1942లో బ్రిటీష్ ప్రభుత్వం యూనివర్సిటీ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్‌గా పేరు మార్చింది. పండిట్ హెచ్‌ఎన్ కుంజ్రూ నేతృత్వంలోని కమిటీ జాతీయ స్థాయిలో పాఠశాలలు, కళాశాలల్లో క్యాడెట్ సంస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేయడంతో 1948 జూలై 15న నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)గా రూపాంతరం చెందింది. 1965లో ఇండో-పాక్ యుద్ధం సమయంలో మొదటి వరుసలో ఆర్మీ జవాన్లు ఉండగా, రెండో రక్షణ శ్రేణిగా ఎన్‌సీసీ క్యాడెట్లు విధులు నిర్వహించారు. దీంతో ఎన్‌సీసీ వింగ్ దేశానికి అవసరమని పూర్తి స్థాయిలో అమలుచేశారు. దేశ వ్యాప్తంగా 17 డైరెక్టరేట్లు, సుమారు 660 ఆర్మీ వింగ్, 60 నావల్, 61 ఎయిర్ వింగ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది నవంబరు నెలలో నాలుగో ఆదివారం అంతర్జాతీయ ఎన్‌సీసీ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఆ రోజు ఎన్‌సీసీ విద్యార్థులు పరేడ్, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఎన్‌సీసీతో ఎన్నో అవకాశాలు...

ఎన్‌సీసీలో చేరడం వల్ల ఆర్మీ, పోలీస్ ఉద్యోగాలతో పాటు ఉన్నత చదువుల్లో కూడా రిజర్వేషన్ల సౌకర్యం ఉండటంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పారామిలటరీ రిక్రూట్‌మెంట్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు 'ఏ' సర్టిఫికెట్‌కు-2 మార్కులు, 'బీ' సర్టిఫికెట్‌కు-6, 'సీ' సర్టిఫికెట్‌కు 10 మార్కులు కలుస్తాయి. ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరడానికి ఒకశాతం, మెడికల్ సీట్లలో 0.25 శాతం రిజర్వేషన్ ఉంటుంది.

పశ్చిమ ప్రకాశంలో అధికంగా ఎన్‌సీసీ విద్యార్థులు...

జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో సైనిక కుటుంబాలు ఎక్కువగా ఉండటంతో వారి పిల్లలు ఎన్‌సీసీలో ఎక్కువగా చేరుతున్నారు. ఆడపిల్లలు సైతం పోటీపడి మరీ ఎన్‌సీసీలో చేరి సర్టిఫికెట్లు పొందుతున్నారు. జిల్లాలో 34 ఆంధ్రా బెటాలియన్‌లో సుమారు 3 వేల మంది ఎన్‌సీసీ విద్యార్థులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతి ఏటా బీ, సీ సర్టిఫికెట్లు పొందేందుకు కాలేజీ స్థాయి విద్యార్థులకు ఒంగోలు, చీరాల, నెల్లూరు, గుంటూరు, హైదరాబాదులో ట్రెక్కింగ్ క్యాంపులు, కేరళ, నాగపూర్‌లో క్యాడర్ క్యాంప్‌లు నిర్వహిస్తుంటారు. ఎన్‌సీసీ విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఉన్నప్పుడే 'ఏ' సర్టిఫికెట్ వస్తే, ఇంటర్ మొదటి సంవత్సరంలో 'బీ' సర్టిఫికెట్ తెచ్చుకునేందుకు ఎన్‌సీసీలో చేరవచ్చు. ఒక వేళ 'ఏ' సర్టిఫికెటు లేకపోయినా నేరుగా 'బీ' సర్టిఫికెట్ కోసం చేరవచ్చు. 'ఏ' సర్టిఫికెట్ పరీక్షకు హాజరుకావాలంటే కచ్చితంగా 40 రోజుల శిక్షణ తీసుకోవాలి.


ఢిల్లీలో గణతంత్ర దినోత్సవంలో కంభం వాసవీ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థి పాల్గొన్న ఫొటో


మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఇంటర్‌లో 'బీ' సర్టిఫికెట్...

ఇంటర్ మొదటి సంవత్సరంలో బీ సర్టిఫికెట్ కోసం ఎన్‌సీసీలో చేరవచ్చు. రెండేళ్ల శిక్షణ తరగతుల అనంతరం పరీక్షల్లో ఉత్తీర్ణులైతే సర్టిఫికెట్ ఇస్తారు. మొదటి సంవత్సరంలో 31 రోజులు, రెండో సంవత్సరంలో 34 రోజులు శిక్షణలో పాల్గొనాలి. ఇంటర్ రెండో ఏడాదిలో నిర్వహించే శిబిరంలో సైతం పాల్గొనాలి. బీ లేకుండా సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోలేరు. బీ సర్టిఫికెట్‌లో కవాతు, ఆయుధ పరీక్ష, రాత పరీక్ష ఉంటాయి. ఆయుధ పరీక్షలో 0.22 రైఫిల్‌లోని పార్టులు మొత్తం విప్పి, తిరిగి బిగించడం నేర్పిస్తారు. రాత పరీక్ష హిందీ, ఇంగ్లిషులో ఉంటుంది.

జిల్లాలో ఎన్‌సీసీ ఉన్న కళాశాలలు	10
విద్యార్థులు	800
విద్యార్థులు	1900
జిల్లాలో ఎన్‌సీసీ ఉన్న హైస్కూళ్లు	28

డిగ్రీలో 'సీ' సర్టిఫికెట్...

డిగ్రీ మొదటి సంవత్సరంలో సీ సర్టిఫికెట్ కోసం ఎన్‌సీసీలో చేరవచ్చు. చివరి సంవత్సరంలో 'సీ' సర్టిఫికెట్ పరీక్ష ఉంటుంది. ఇన్‌స్టిట్యూషనల్ శిక్షణ తీసుకోవాలి. జాతీయ సమగ్రత శిబిరంలో పాల్గొనడానికి ఈ శిక్షణ చక్కని అవకాశం. ఇందులో పాల్గొంటే అదనంగా 25 మార్కులు కలుపుతారు. 'సీ' సర్టిఫికెట్ వస్తే విద్యార్థులకు మంచి అవకాశాలుంటాయి. కేంద్ర బలగాల్లో చేరేందుకు రిజర్వేషన్ ఉంటుంది. కేంద్ర పోలీస్ సంస్థలైన బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీలో అధికారిగా గానీ, కానిస్టేబుల్‌గాగానీ చేరేందుకు ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది.

ఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకల్లో కంభం ఎన్‌సీసీ విద్యార్థులు...

ఢిల్లీలో దేశ ప్రధాని పాల్గొన్న గణతంత్ర దిన వేడుకల్లో జిల్లా నుంచి ఎన్‌సీసీ విద్యార్థులు ఎంపికవుతుంటారు. గతేడాది ఢిల్లీలో జరిగిన గణతంత్ర దిన వేడుకల్లో కంభంలోని ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాలకు చెందిన నల్లబోతుల భరత్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్మీలో ఉద్యోగం పొందాను



నేను వాసవీలో చదువుకునే సమయంలో ఎన్‌సీసీలో చేరి సర్టిఫికెట్ పొందాను. అగ్నివీర్ సెలక్షన్స్‌కు వెళ్లి ఎంపికయ్యాను. నేను ప్రస్తుతం ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాను. ఎన్‌సీసీలో చేరి సర్టిఫికెట్ పొందితే ఆర్మీలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

– యు.మోహన్

ఢిల్లీలో గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొన్నా



నేను కంభం ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతూ ఎన్‌సీసీలో చేరాను. గతేడాది ఢిల్లీలో ప్రధానమంత్రి పాల్గొన్న గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొని ఆయనతో గ్రూప్ ఫొటో దిగడం గర్వంగా ఉంది. ప్రస్తుతం ఆర్మీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నాను. ఎన్‌సీసీలో శిక్షణ పొందితే ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు క్రమశిక్షణ వస్తుంది.

– ఎస్.భరత్ కుమార్, కంభం

విద్యార్థుల భవిష్యత్తుకు ప్రయోజనం



పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి సర్టిఫికెట్లు పొందితే వారికి ఉన్నత చదువులకు మెరుగైన అవకాశాలు పొందడంతో పాటు ఉద్యోగావకాశాల్లో ఉపయోగపడుతుంది. విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉంటారు. సేవా భావం పెరుగుతుంది. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఎన్‌సీసీ ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– షేక్ ఇక్బాల్, ఎన్‌సీసీ అధికారి, కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

క్రమశిక్షణ పెరుగుతుంది



ఎన్‌సీసీ విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సేవాభావాన్ని పెంపొందించేలా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఎన్‌సీసీ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు, స్వచ్ఛభారత్, శ్రమదానం, తదితర కార్యక్రమాలు నిర్వహించి సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

– ప్రసాద్, ఎన్‌సీసీ ఆఫీసర్, వాసవీ జూనియర్ కళాశాల, కంభం

ఎన్‌సీసీతో ఉద్యోగాల్లో రిజర్వేషన్లు




నేను డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాను. ప్రస్తుతం సీ సర్టిఫికెట్ పొందేందుకు శిక్షణ పొందుతున్నాను. ఈ సర్టిఫికెట్ పొందితే ఉన్నత చదువుల్లో రిజర్వేషన్లు పొందవచ్చు. అదే విధంగా ఆర్మీలో మంచి ఉద్యోగం పొందేందుకు వీలుంటుంది.

– కాసుల రజిత, డిగ్రీ ఫైనలియర్, ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల, కంభం

క్లుప్తంగా

కేబుల్ వైర్ల లారీ దగ్ధం


దగ్ధమవుతున్న లారీ, కేబుళ్లు

టంగుటూరు: కేబుల్ వైర్ల లారీ అదుపుతప్పి బోల్తాపడింది. వెంటనే ఇంజిన్‌లో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన టంగుటూరు మండలంలోని రైజ్ కాలేజీ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఫైర్ సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కేబుల్ వైర్ల లోడుతో కోల్‌కతా నుంచి కేరళ రాష్ట్రంలోని కొట్టాయం వెళ్తున్న లారీ మార్గం మధ్యలో ఒంగోలు దాటిన తర్వాత వల్లూరు చేరుకునే ముందుగా అదుపుతప్పి బోల్తా పడింది. ఒక్కసారిగా ఇంజిన్‌లో మంటలు చెలరేగడంతో లారీతో పాటు అందులోని కేబుల్ వైర్ల లోడు కూడా పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు, ఫైర్ సిబ్బంది మంటలు అదుపుచేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మంటలు అదుపు చేస్తున్న సీఐ, ఎస్సై, ఫైర్ సిబ్బంది

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

పెద్దారవీడు: మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని దేవరాజుగట్టు గ్రామ సమీపంలో కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం పట్టణం శివాజీ బజారుకు చెందిన వెంకటేశ్వర్లుకు మతిస్థిమితం లేదు. ఈ నెల 17వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించినా కనిపించలేదు. ఈ నేపథ్యంలో మృతిచెందాడు. అన్నం, నీరు లేక మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. పొలం పనులకు వెళ్లిన వ్యక్తికి మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు వెంకటేశ్వర్లు (65)గా గుర్తించి అతని కుమారుడు శేషయ్యకు సమాచారం అందించారు. శేషయ్య హౌసింగ్ డీఈ దగ్గర కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.అనిల్‌కుమార్ తెలిపారు.

పోలేరమ్మతల్లి ఆలయంలో చోరీ

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లిలో ఇటీవల నూతనంగా నిర్మించిన పోలేరమ్మతల్లి ఆలయంలో గురువారం దొంగలు పడగా, శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుండగులు ఆలయంలోని రెండు హుండీలతో పాటు ఆలయం లోపల ఉన్న బీరువాను పగలకొట్టి నగదు అపహరించారు. గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సూచనల మేరకు క్లూస్ టీమ్ వచ్చి ఆలయ పరిసరాలను పరిశీలించి వేలిముద్రలు సేకరించింది. ఆగస్టులో పోలేరమ్మ గుడి ప్రతిష్ఠ జరిగింది. అప్పటి నుంచి భక్తులు హుండీలలో కానుకలు వేస్తున్నారు. హుండీలలో సుమారు రూ.80 వేల వరకు నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఎక్కువ డబ్బులు ఉంటాయని భావించిన దుండగులు అర్ధరాత్రి ఆలయం గేటు తాళాలు పగలకొట్టి చోరీ చేశారు. ఈ వారంలోనే పక్కపక్కనే ఉన్న గ్రామాలైన అంబాపురం శివాలయంలో రూ.20 వేలు, రేగడపల్లి పోలేరమ్మతల్లి ఆలయంలో రూ.80 వేల వరకూ దొంగతనాలు జరగడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆలయాల్లో దొంగతనాలు చేసే దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.


ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

గ్రామస్తులపై అటవీ అధికారుల దాడి

- సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామస్తుల ధర్నా

మార్కాపురం రూరల్: తాము గడ్డి కోసం అటవీ ప్రాంతానికి వెళితే.. అటవీ అధికారులు తమపై దాడిచేశారని పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామానికి చెందిన పలువురు శనివారం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా రైతు సంఘ నాయకుడు గాలి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కె.హనుమంతారెడ్డి, రాజేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్య, రామకృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు ధర్నాలో పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులంతా అడవులపై ఆధారపడి పశువులు, గొర్రెలు, మేకలను అడవిలో మేపుకుంటూ జీవిస్తున్నారన్నారు. శుక్రవారం అడవికి వెళ్లగా, పశువుల కాపరి బోగెం వెంకటేశ్వర్లును అటవీశాఖ అధికారులు కొట్టి కేసు నమోదు చేశారన్నారు. వెంకటేశ్వర్లు గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ గ్రామం వెలుగొండ ప్రాజెక్టులో ముంపునకు గురవుతోందని, ఆర్ ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలాలిస్తే తాము అక్కడి నుంచి వచ్చేస్తామని అన్నారు.


సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గుండంచర్ల గ్రామస్తులు


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు

మాపైనే దాడిచేశారు

గుండంచర్ల గ్రామానికి చెందిన వారు శుక్రవారం ఆ గ్రామం దాటి 7 కిలోమీటర్లు రిజర్వు ఫారెస్టులోకి వేటకుక్కలతో వచ్చారు. నేను, మా సిబ్బంది ప్రశ్నిస్తే మహిళలతో మాపై దాడి చేయించారు. మాపై దాడిచేసిన వారిని గుర్తించి పెద్దారవీడు పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టాం. మేము ఎవరినీ కొట్టలేదు. అడవిలోకి రాకూడదని మందలించి పంపించాం.

– నాగరాజు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (డీఆర్‌ఓ)

జగన్ కుటుంబంపై దుష్ప్రచారం చేసిన వారిపై ఫిర్యాదు

దొనకొండ: సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై దుష్ప్రచారం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ దొనకొండ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు చేయడం బాధాకరమన్నారు. జగన్ కుటుంబంపై తప్పుడు పోస్టులు పెడుతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. వైఎస్సార్ సీపీ యూత్ జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన కార్యకర్తలు ఇష్టారాజ్యంగా జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ అనుచిత పోస్టులు పెడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రోజురోజుకు వారి ఆగడాలకు అడ్డు లేకుండా పోతోందని, అందుకే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నూనె వెంకటరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, కాలూరి రమణయ్య, విప్పర్ల వెంకటసుబ్బయ్య, ఆది సుబ్బారావు, పాతకోట కోటిరెడ్డి, విప్పర్ల చిన్న మల్లయ్య, కన్నెధార వెంకటసుబ్బయ్య, బాపనపల్లి శ్రీను, గొంగటి పోలిరెడ్డి, తాళ్లూరి నగేష్, కసిబిసి నాగరాజు, ఎగ్గోని కృష్ణారెడ్డి, గుంటు కొండయ్య, షేక్ రసూల్, ముజాయిద్, ప్రసాద్, బుజ్జి, పెసల చిన్న నారాయణరెడ్డి, చంద్రా, సీహెచ్.నాగార్జున, మునగాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

కంభం: విద్యుత్ షాక్‌తో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని ఎల్.కోట గ్రామంలో శనివారం జరిగింది. గ్రామంలో నివాసం ఉంటున్న తాటికొండ ప్రసాద్(45) అనే రైతు శనివారం తన పొలం దగ్గర గడ్డి కోస్తున్న సమయంలో కరెంటు తీగ తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. విద్యుత్ శాఖాధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కంభం ఎస్సై బి.నరసింహారావు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.


మృతి చెందిన రైతు


పోలీసులు పట్టుకున్న ఆవుల కంటైనర్

గోవులను తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

కంభం: అక్రమంగా ఆవులను తరలిస్తున్న కంటైనర్‌ను శనివారం కంభంలో పోలీసులు పట్టుకున్నారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ కుంట నుంచి కంటైనర్‌లో 50 ఆవులను అనంతపురం తరలిస్తుండగా, కందులాపురం సెంటర్‌లో హైవేపై కంభం పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని గోవులను దగ్గర్లోని గోశాలకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.